# దొంగలు

వీరప్ప తన ముంజేతి కడియాన్ని కుదువపెట్టుకుంటారేమోనని, లేదా. కొంటారేమోనని వెండి బంగారపు కొట్లన్నీ తిరిగాడు. ఒకడు వెండిదేనా? అంటే మరొకడు నీదేనా? అని అడిగిన తీరును గుర్తుకు తెచ్చుకుని ఓ బరువైన శ్వాస వదిలాడు వీరప్ప.

తిరిగి తిరిగి వేసారిన వీరప్పకు బాగా ఆకలేస్తుంది, చీకటి పడింది. సినిమా టాకీసు ముందున్న బండిమీది బజ్జీలతో, మున్సిపాలిటీ వాళ్ళ నీళ్ళతో కడుపు నింపుకున్న వీరప్ప, బండివాడి సలహాపై ఆ రాత్రి పడుకోవటానికి గాంధీపార్కు చేరాడు.

పార్కుగేటు మూసివుంది. గేటు చువ్వల మధ్య నుండి చూస్తే గాంధీ విగ్రహం జైల్లో వున్నట్లు కన్పించింది. "గాంధీగారు తన

జీవితంలో అదికభాగం జైల్లో గడిపాడు" అన్న పంతులుగారి మాటలు గుర్తొచ్చాయి బీరప్పకు. "సచ్చినంక గూడ జేల్లనే వుంచిండ్రు" అని బాధపడ్డాడు బీరప్ప. చేతులు జోడించి "అయ్యా! ఏమి సొతంత్రం తెస్తివోగాని, మా బతుకు అయ్యాల ఎట్లుందో, యియ్యాలట్లనే వుంది. తెల్లోడు ఎల్లిపోయినా మా బతుకులు తెల్లారలేదు తండ్రీ" అంటూ రెండు మూడు సార్లు దండం పెట్టాడు. గాంధీగారు మేకపాలు తాగేవాడని పంతులుగారు చెప్పిన మాటలు గుర్తొచ్చి "ఆ మేకలు కాసేది నేనే సూడు! నా కెవ్వి తిప్పలో" అంటూ అక్కడ నుండి నడిచాడు బీరప్ప.

పోయిన సంవత్సరం పంచాయితీ ఎన్నికల్లో తన ఊరొచ్చి "నీ కెప్పుడైనా పని వుంటే నా దగ్గరికిరా! మీ కోసమే మా పదవులు" అన్న ఇప్పటి సమితి ప్రెసిడెంట్ మాటలు నమ్మి ఆర్నెల్ల నుండి ఆఫీసుచుట్టూ తిరుగుతున్నప్పుడు, పడిన బాధలు ఒక్కొక్కటే కళ్ళముందుకు రాసాగాయి.

ఒకరోజు ప్రెసిడెంటుగారు తన గదిలో వున్నట్లు తెలుసుకున్న బీరప్ప గడిముందు కూర్చున్న అటెండర్ కాశీం చేతిలో ఓ రూపాయి వుంచి, లోపలికెళ్ళి, "దండం దొర" అన్నాడు.

ఆ రోజు దినపత్రిక చదువుతున్న వాడల్లా తలెత్తి బీరప్పను చూసి, మళ్ళీ పేపరు చదవడంలో మునిగాడు.

"నన్ను గుర్తుపట్టలే దొరా!"

కళ్లు పేపరు మీద వున్నా, మనసు మాత్రం ఓ సంవత్సరం వెనక్కు వెళ్ళింది. ఈన పేరు ఎందుకు తెలియదు - "అయినా ఎందరినని గుర్తుంచుకుంటాం".

"ఎలచ్చన్లో మా వూర్కి వచ్చింౘ్రు. అందరం తమ పార్టీకే జేకొట్టి చేచేసి గెలిపిస్తిమి"

ఈయన "ఒక్కొక్కరి ఓట్లతోనే తాను గెలిచినట్లు" అని గొణుక్కున్నాడు.

"డప్పులు, కొమ్ములతో ఊరేగిస్తిమి. అయ్యాల్టి దావత్తుకు మీరు సారబొట్లు పంపితిరి నేనొక యాటపిల్ల నిస్తివి. ఊరంతా ఓట్ల పండగ సేస్తిమి"

"ఇంతకూ నీకేం కావాలి?" అంటూ బీరప్ప మాటలకు అడ్డు తగిలాడు ప్రెసిడెంటుగారు- వెనుకటి కథలన్నీ వినదలచుకోక.

"గదె! గొర్రె జీవాల్ని కొనుక్కుంటందుకు అప్పు యిస్త రంటె దరఖాస్తు పెట్టిన, సాన రోజులయ్యింది. తమరు తలుసు కుంటే..." మాటలు పూర్తి కాకముందే.

"నీవు మందలో నుండి గొర్రెల్ని పట్టించినంత సులువుకాదు- అప్పు ఇవ్వటం" అంటూ బెల్ నొక్కాము.

"జీ! సాబ్" అంటూ లోపలికొచ్చాడు కాశిం.

"ఈయన్ని మేనేజరు దగ్గరికి తీసుకుపో!"

"అచ్చాసాబ్!"

తనను గుర్తుపట్టనందుకు బీరప్ప దిక్కుముఖం వేసి ప్రెసి డెంటును మరీ మరీ చూశాడు. అంతేకాదు. ఆయన తలమీద గోడకున్న ఇందిరాగాంధి బొమ్మను గుర్తించాడు. "అమ్మా! నీ చెట్టుకు కాసిన సేతి బీరకాయలు" అంటూ చేతులెత్తి దణ్ణంపెట్టి, కాశింను అనుసరించాడు బీరప్ప.

బీరప్ప గదిలో నుంచి పోగానే ఎంతో బరువు దిగినట్లని

పించింది ప్రెసిడెంటుకు. "వాడు ఎందుకు దణ్ణం పెట్టినట్లు? వాడు చేతులెత్తి దణ్ణం పెట్టేటప్పుడు వాడి గొడ్డలి సరిగ్గా తనను నరికేటందుకు లేపినట్లు కనిపించింది. ఓటేసిన ప్రతి సన్నాసికి అప్పు యివ్వాలంటే..."

అంతలో ఓ జీపు హారను మ్రోగింది. బీరప్ప అదురుకుని పక్కకు జరిగాడు— దుమ్ము లేపుతూ పోతున్న జీపును చూస్తూ "సీ యక్క, జెర్రయితే టక్కరు పెడుతుందెనే..." అనుకుని, మళ్ళీ అప్పు గురించి ఆలోచిస్తూ నడుస్తున్నాడు.

ప్రెసిడెంటు తొడేలు అనుకుంటే మేనేజరు నక్క.

"ఏం! సంగతి బోయిడా" మేనేజరు నవ్వుతూ.

"ఏముందొర! గొర్రె జివ్వాలకు అప్పు ఇప్పియ్యమని దరఖాస్తు పెట్టి ఆర్నెల్లయింది.

"ఈ ఆఫీసు ఏమన్నా గొర్రెనా, మేకనా నెలలనుబట్టి పిల్లలు పెట్టడానికి! ఇక్కడ జరిగే ప్రతి పనికీ ఓ రూలు, ఓ పద్ధతీ వుంటుంది" అన్నప్పుడు ఎదురు సీట్లో కూర్చున్న లోన్స్ ఇన్స్పెక్టరు చిన్నగా నవ్వుకుని ఓ సారి బీరప్పను, మేనేజరును చూసి—

"ప్రెసిడెంటుగార్ని కలవకపోయావా?" అన్నాడు

"కల్సిన దొర"

"ఏమన్నారు?"

"ఇక్కడికి! తమరి దగ్గరికే పొమ్మన్నడు"

"పొమ్మంటే! ఏం లాభం?"

"ఆయన గుర్తుపట్టికూడా, గుర్తుబట్టనట్టే మాట్లాడిండు. ఆయనకు ఎలచ్చన్ల ఓటేసిన, ఓ యాటనుగూడ యిచ్చిన. ఇప్పుడవన్నీ..."

"అచ్చా! బిడ్డా! యాటనుకూదా యిచ్చినాడా! మరి మాక్కూడా ఓ యాటను యివ్వరాదు!" మేనేజరు.

"కౌతకు పనికొచ్చేయి లేవుదొర! అన్నీ కొదుమలే"

"అవ్వన్నీ మాకు చెప్పకు. నీ విట్లా గొర్రెను తేగానే బి.డి.ఓ. గారికి చెప్పి అట్ల అప్పు ఇప్పిస్తాం. ఏమంటరు ఇన్స్పెక్టర్ గారు?"

"మీరు తలుచుకుంటే అరగంట చాలు"

బీరప్పకి కోపం ముంచుకొచ్చింది. "దొంగ కొడుకులు—తలుచుకుంటే... అరగంట, తలుచుకోకుంటే... ఆర్నెల్లా" లోలోపల తిట్టుకున్నాడు బీరప్ప.

అన్నట్టే మరునాడు ఉదయం ఆఫీసు వెనకాల వున్న వేప చెట్టుకు కట్టేన గొర్రె అరుస్తూంది.

అప్పు మంజూరయిన కాగితం బీరప్ప చేతికొచ్చింది.

* *

అర్ధరాత్రి అమవాస్య రోజు! అప్పుడే కరెంటు పోయింది. పట్టణం అంతా చిమ్మచీకట. గస్తీ తిరుగుతున్న ఓ కానిస్టేబుల్, జమేదారు ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంటును తిడుతూ నడుస్తున్నాడు. నడుస్తూ నడుస్తూ హఠాత్తుగా ఆగిపోయిన కానిస్టేబుల్ని చూసి తాను ఆగాడు జమేదారు.

"సార్" వణుకుతున్న గొంతుతో, ముందుకు చూస్తూ.

"ఏంటోయ్... ఏంటి?"

"మీరు సరిగ్గా ముందుకు చూడండి సార్"

ఎదురుగా మళ్ళీ "చెక్" మంది.

"నూశారా! సార్ అక్కడ "చెక్" మంది! మనిషి పూర్తిగా

వణుకుతూ.

ఈసారి రెండుసార్లు "చెక్" మంది.

"అనుమానం లేదు. అది కొరివి దెయ్యమే!"

"అబ్బే! అనుమానం ఎందుకు? తప్పకుంట అదే. రెండేళ్ళ క్రితం ట్రాన్సుఫరయిన మన మూర్తి యస్. ఐ. గార్కి కూడా ఇక్కడే కనిపించిందట" జమేదారు.

ఇద్దరికీ గుండె వేగం పెరిగింది. కాళ్ళలో వణుకు మొదలయ్యింది.

"మన దస్తగిరి కానిస్టేబుల్ క్కూడా నెలక్రింద ఇక్కడే కనిపించిందట సార్" అమాయక చూపులతో.

"వాడొట్టి పిరికివాడు! స్టేషన్‌కు పరిగెత్తుకొచ్చిండు. డ్యూటీలో వుండి అట్ల రాకూడదు"

"అంటే మనం...?

"మనం డ్యూటీలో వున్నాం పద" అంటూ జమేదారు, తన టోపీని, బెల్ట్‌ను సరిచేసుకున్నాడు.

"అయినా! మనం యూనిఫారం మీద వున్నాం కద! సార్ అది మన—"

"అదే నేను చెప్పేది. పద..."

కానిస్టెబుల్ రెండు మూడు సార్లు కర్రను నేలకు కొట్టి, బూట్ల చప్పుడు చేశాడు. ఒక్కసారి శ్వాస పీల్చి వదిలి ఇద్దరూ ముందుకు నడిచారు. కొంచెం దూరం నడిచి మళ్ళీ పరిశీలనగా చూశారు. "చెక్" మనలేదు కాని, అక్కడే ఏదో మండుతోంది.

"మనం ఎక్కడున్నాం?" జమేదారు

"డ్యూటీలో వున్నాం సార్!" అంటూ గట్టిగా కళ్లు మూసుకుని తన చేతి కర్రను మండుతున్న వైపు విసిరాడు.

అంతే. మండే నిప్పు కింద పడ్డది.

ఓ నల్లని ఆకారం లేచి నిలుచుంది. అక్కడంతా పొగ సుళ్లు తిరుగుతోంది.

"ఎవరక్కడ?" అంటూ జమేదారు కళ్లు మూసుకున్నాడు.

"......" చప్పుడు లేదు_

"దయ్యానివా? ...మనిషివా?"

"మనిషినే దొర!"

"అమ్మయ్య!" అంటూ కళ్లు తెరిచాడు జమేదారు.

"సంపావురా! నా కొడకా" అంటూ కళ్ళు తెరిచిన కానిస్టేబుల్ కొంచెం ముందుకు నడిచి కర్రనందుకోబోయి వెనక్కొచ్చి-

"సార్! వీని దగ్గర గొడ్డలుంది".

"గొడ్డలా!" కొంత సేపాలోచించి_

"ఏ వూరు నీది?"

"రానకొండ"

తన కర్ర నందుకొని మళ్ళీ వెనక్కొచ్చాడు కానిస్టేబుల్.

"ఉండేది కొండల్లో, చేతిలో గొడ్డలి అంటే తప్పకుండా వీడు..." జమేదారు ఆలోచన వేగం పెరిగింది.

"తప్పకుండా వాడే సార్" అంటూ కానిస్టేబుల్ కాస్త వెనక్కు జరిగాడు.

జమేదారు కూడా పక్కకు జరిగాడు.

ఇద్దరూ ఒకరుచేయి ఒకరు పట్టుకుని భయాన్ని అదుపులోకి

తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు.

"ఏయ్! నీ దగ్గరున్న ఆయుధాన్ని యిటు పారేయి! లేకపోతే ఫైర్ చెయ్యాల్సొస్తుంది" జమేదారు.

"అడవిలో నీవు తప్పించుకోగలవు. కాని ఊళ్లో... అందునా మా ఏరియాలో ఎటూ పారిపోలేవు. మేం డ్రెస్సు మీదున్నాం, మమ్మల్ని కూడా ఏం చేయలేవు. గప్‌చుప్‌గా సార్ చెప్పినట్లు చెయ్యి" అంటూ మరొకసారి కాస్త దగ్గరికి నడిచి పరికించి చూసి-

"కాలుతున్న బాంబును ఆర్పేయ్యి"

తనకేమీ అర్థంగాక అలాగే నిల్చుంది ఆ ఆకారం.

"దాన్ని ఆర్పేయి ముందు" జమేదారు.

ఆర్పేశాడు.

"ఆ గొడ్డలి కూడా పారెయ్యి"

పారేసాడు.

"ఆ కింద ఉన్నవీ బాంబులేనా? నీవు పక్కకు జరుగు"

పక్కకు జరిగాడు.

ఇద్దరూ వెళ్ళి క్రిందపడ్డ వాటిని మెల్లగా చేతిలోనికి తీసుకుని చూసి తెల్లబోయారు. అది జక్‌ముఖ్ సంచి. ఇంతకు ముందార్పింది కాలుతున్న చుట్ట. ఒకరి ముఖం ఒకరు చూసుకుని, ఇద్దరూ వొకేసారి అతనివైపు చూశారు.

గొంగళి కప్పుకున్న ఆకారం చేతులు జోడించి నిల్చుంది.

"ఎవర్రా! నీవు?" కానిస్టేబుల్.

"బీరిగాన్నయ్యా!"

"ఇక్కడేం చేస్తున్నవ్?"

"పండుకున్న దొర"

"పండుకున్నది కాక, ఓ చుట్టతాగి అందర్నీ పరేశాను చేస్తా వురా! దొంగనాయాలా! పద స్టేషన్‌కు" కానిస్టేబుల్.

బీరప్పకు ఎటూ అర్థం కాలేదు. నిశ్చేష్టుడై నిలుచున్నాడు.

"అరె! నడూబే" అంటూ నెత్తి మీద కర్రతో కొట్టాడు. కానిస్టేబుల్. ఆ దెబ్బకు నెత్తిరుమాలు మడతల్లోనుండి గుడ్డతో చుట్టిన కట్టవూడి కిందపడింది. దాన్ని తీసుకుని జమేదారు వైపు చూశాడు.

"పద పోదాం. జానేదేవ్ భేకూఫ్‌కు" అంటూ జమేదారు స్టేషను వైపు నడిచాడు. ఆ కట్టను జేబులో పెట్టుకుంటూ తాను ఫాలో అయ్యాడు కానిస్టేబుల్.

"అయ్యా! ఆ సంచిల సుట్టాకు, పొవాకుంది దొర!" భయ పడుతూనే ఆతురతతో అడిగాడు బీరప్ప.

"ఉండు భే! మేం మాత్రం చుట్ట తాగమా?" అంటూ వెళ్ళి పోయారు.

ఎటూ అర్థంకాని బీరప్ప "ఈ పోలీసోల్లు కూడా ఇట్ల సేస్తే ఇంకెవర్కి సెప్పుకోవాలె" అనుకుంటూ ఈ పట్నంలో ఉండే మనుషుల్ని గూర్చి ఆలోచించి, "ఇది ఊరా... అడివా..." అను కుని, పొద్దున ఆఫీసులో జరిగిన సంఘటన గూర్చి ఆలోచిస్తు న్నాడు.

లోన్ శాంక్షన్ ప్రొసీడింగు తీసుకెళ్ళి అకౌంట్సు సెక్షన్లో యివ్వగానే అక్కౌంటెంటుగారు దాన్ని కిందా మీదా చూసి "ఇది మా సెక్షనుకు యింకా రాలేదు" అంటూ తిరిగి బీరప్పకు

యిచ్చాడు.

"చూడు! కాగితం పట్టుకుని రాగానే చెక్కు చేతికొస్తదా తంఁడీ! ఓ వారం రోజుల తరువాత రా!" వెటకారంగా అన్నాడు అకౌంటెంటుగారు.

"వారం" అనేసరికి బీరప్పకు చలిజ్వరం వచ్చినంత పనయింది. అకౌంటెంటును చూస్తూ నిలుచున్నాడు.

"ఏం! చూస్తవు? ప్రొసీడింగ్ కాంగనే చెక్కు అవుద్దా! బడ్జెట్ చూడాలి. అదీగాక, చెక్కుబుక్కు అయిపోయిందేమో..." అని అనుమానం వెలిబుచ్చాడు.

రెప్పవాల్చకుండా చూస్తున్న బీరప్పలో అదో భావం కదిలింది. అంతలో "టంగ్" మంది గోడగడియారం.

అందరూ భోజనాలకని వెళ్ళారు.

బీరప్ప తన గొంగళిని మడిచి నేలమీద వేసి దానిమీద కూర్చున్నాడు లంకలో హనుమంతుడు తన తోక చుట్టమీద తాను కూర్చున్నట్లు. అప్పుకోసం దరఖాస్తు పెట్టి చాల తప్పుపని చేశా నన్నట్టు ఓ బరువైన శ్వాస వదిలాడు. "గొఁరెను తిన్న నా కొడుకులకు ఇంత ఇస్వాసం లేదు, వీల్లకంటే నా మందకాడి కుక్క నయం, సౌరెడు గంజిపోస్తె దినమంతా మందను కాసుద్ది".

మరోసారి గడియారం రెండు కొట్టింది. టంగుమని శబ్దంవిన్న బీరప్ప గడియారం వైపు చూసాడు. ఎవరున్నా, లేకున్నా గడియారం తనంతట తాను నడుస్తూనే వుంది. "మనుషుల కంటె యిదే నయం కదా!" అనుకుంటూ చుట్టు చూసాడు. పైన ఫ్యాను తిరుగుతూనే వుంది. లైట్లు వెలుగుతూనే వున్నవి.

గోడ గడియారం టంగ్, టంగ్ మంటూ మళ్ళీ మూడుసార్లు కొట్టింది. అక్కౌంటెంటు యింకా రాలేదు. అన్నం తినడానికి యింత సేపు యెందుకు పట్టిందో తనకు అర్థం కాలెదు. ముంతెడు బువ్వ మూడు గడియల్లొ పూర్తి చేస్తాడు తాను. మూడు పూటలు తిన్న నా కొడుకులు ఒక్కపూట పనిచెయ్యరు. కట్టలకు కట్టలు జీతాలు తీసుకొని తిని త్రాగడం మాత్రం తెలుసు. ఊల్లల్లో మానెడు గింజలకు ఎకరాలకొద్ది పొలాన్ని దున్నుతాం. అసలు తిండి తిన్న వల్లు పనిచేయకుంట ఎట్లుంటది? అందుకే కొత్త కొత్త రోగాలు.

"ఏమయ్యా! నీవింకా ఇక్కడే వున్నవా? పోలేదా బీరప్ప"

కాగితం పట్టుకుని, చెప్పులు గొంగి దగ్గరే వదలి అక్కౌంటెంటు టేబుల్ దగ్గరికి పోయి నిల్చున్నాడు.

"చూడు బోయడా! పొగలేందే సిగం రాదని నీకు తెలియదా?"

బీరప్ప వళ్ళు ఒక్కసారి మొద్దుబారినట్లయింది.

"అంటే ఇంకా ఇయ్యాలన్నమాట! నిన్న తిన్న గొర్రె యింకా అరిగనేలేదు మళ్ళ..., యాడ తిని, ఆడనే మూతి రాసే కోడి నా కొడుకులు" అంటూ లోలోపల తిట్టుకున్నాడు.

"అర్థం కాలేదా!" అక్కౌంటెంటు.

"యిప్పుడు నా దగ్గర చిల్లిగవ్వ లేద్దొరా!"

"దగ్గరుంటాయా? లేవాలి మరి! అంతే"

"రేపు బేంకుల తీసుకున్నంక తెచ్చిస్త దొర"

"అచ్చా! చేపకు ఈత నేర్పుతున్నావన్నమాట"

బీరప్ప చప్పుడు చేయలేదు.

"ఆ చేతికి వుంది వెండి కడియమేగా?"

"ఎందిది కాక రాతెందిదా! మరి పెండ్లిల అత్తగారు పెట్టిన నగ యిది" అంటూ చేతికున్న కడియాన్ని తిప్పి చూసుకున్నాడు. వంటి రాపిడికి అరిగిన కడియాన్ని మరీ మరీ చూసుకున్నాడు.

* *

బ్యాంకు అవరణ అంతా యిచ్చి, పుచ్చుకునే జనంతో కిక్కిరిసి వుంది. సమితి అక్కౌంటెంటు కళ్లు బీరప్పను వెతుకుతున్నాయి. హాలంతా కలియ జూసి బయటి గేటు వైపు నడిచాడు. ఎదురుగా సైకిల్ దిగుతూ ట్రెజరీ అక్కౌంటెంటు.

"ఏం గురూ! చెక్ క్యాష్ అయ్యిందా?"

"అయినట్టే కాని వాడే కవిపించలేదు"

"అంటే చెక్కెళాడా!" అదుర్దుగా అడిగాడు. ట్రెజరీ అక్కౌంటెంటు తాను అనుకున్నట్లే జరిగిందని నొసలు కొట్టుకున్నాడు.

"నేను వచ్చేవరకు గేటుదగ్గరే వుండమని చెప్పా!"

"దండగ గురూ! నేను చెప్పానుగా! మా దగ్గర రోజూ బ్యాంకు పేరు చెప్పి యెంతోమంది యెగనామం పెడతారని"

"ఎంత మోసం చేశాడు. అమాయకుడిలా ఉండి"

"చూడు గురూ! రోగి బెడ్ మీదున్నప్పుడే ఫీజు లాగాలి. రోగం కుదిరిందా? మనిషి కనబడడు, ఫీజు బాకీ పడుద్ది"

"అదీ నిజమే అనుకో! కాని నేను అంత తెలివి తక్కువ వాణ్నేం కాదుగా! వాడి వెండి కడియం నా దగ్గరుంది" అంటూ బీరప్ప చెక్కు తీసుకునేముందు తనదగ్గరుంచిన కడియాన్ని జేబులోనుంచి తీసి చూపించాడు. దాన్ని చూసిన ట్రెజరీ అక్కౌంటెంటుకు మరో అనుమానం తగిలింది.

"ఆయన దగ్గర కడియం వుంటే తనకే మొస్తది" అవి గుర్తుకు రాగానే ఎలాగైనా అతన్ని పట్టుకోవడం తప్పనిసరి అనుకుంటూ "బహుశా! బస్‌స్టాండ్ వెళ్ళొచ్చు పోదాం పద"

"అతను యింకా వుంటాడంటావా?"

"మన ఆర్.టి.సి. బస్సుల సంగతి మనకు తెలియందేముంది? తప్పక ఉంటాడు పదండి" అంటూ ఇద్దరూ సైకిలెక్కి బయలు దేరారు.

బస్‌స్టాండు నిండా జనం అటూ, ఇటూ తిరుగుతున్నారు. ఈ ఇద్దరికళ్ళూ బీరప్పను వెదుకుతున్నాయి. దూరంగా ఒక పండ్ల బండి దగ్గర గొంగళి-తలపాగ కనిపించింది.

"అమ్మయ్య" అంటూ ఓ సారి ఊపిరి పీల్చి యిద్దరూ ఒక్క అంగలో అక్కడికి చేరి చూసేసరికి బీరప్పకాదు. అతని సోదరు డెవరో...

తన ముందుకే వచ్చి నిలుచున్న వీళ్ళను చూసి, "అయ్యా! అక్కడున్న బస్సు ఏ ఊరికి పోద్ది?"

"మన తాతగారి ఊరికి" ట్రెజరీ అక్కౌంటెంటు జవాబు.

"అంత కోపం ఎందుకు తండ్రీ! సదువురాని సన్నాసిని, సదివి సెపుతారేమోనని అడిగిన"

"ఇంకా నయం! నీకే చదువు చెప్పమనలే!" సమితి అక్కౌం టెంటు.

ఇద్దరూ వెళ్ళడానికి సిద్ధంగావున్న బస్సువేపు నడిచారు,

బస్సులో ముందు గొడ్డలి, ఆ తర్వాత ఎర్రగీతల రూమాలు, ఆ తర్వాత బీరప్ప ముఖం కనిపించాయి. ట్రెజరీ అక్కౌంటెంటు

సమితి అక్కౌంటెంటుకు సైగతో చూయించాడు. ఇద్దరూ మెల్లగా బస్సెక్కి బీరప్ప పక్కన నిల్చున్నారు.

బీరప్ప తన ఆలోచనలో తానున్నాడు. "గొర్రెల్ని కొనాలి, కాలం మంచిగైతే, సంవత్సరానికే రెండింతలయితయి. బీరప్ప దేవునికో గొర్రెపొటేల్ని యిడువాలి.

"ఏమోయి చెప్పకుండనే వచ్చినవు?" సమితి అక్కౌంటెంటు ప్రశ్న.

బీరప్ప ఒక్కక్షణం తత్తరతోయి చూశాడు.

"విన్నే! పేం బ్యాంకు దగ్గరికి వచ్చేసరికి వెళ్ళొచ్చినావ్"

"రకం ఇవ్వంగనే, బయటకొచ్చి సూస్తి, ఎవరూ కనిపియ్యలే, మళ్ళొచ్చిన్నాడు కలుసొచ్చు అని"

"ఇంకా నయం – వచ్చేజన్మలో అనలే. తియ్...తియ్... ఏదో ఈసారు చెప్పిండని చెక్ పాస్‌చెస్తే"

బీరప్పకు వళ్లు మండింది. ఏన్నో రోజుల నుంచి అనుభవిస్తున్న బాధ కోపంగా మారింది. ముఖ కవళికలు మారినవి. కనుగ్రుడ్లు ఎర్రనైనవి. నోటిలో చుట్ట ఎర్రగా కాలుతూ పొగను వదులుతోంది. తాగుతున్న చుట్టను నేలకొక్కట్టి, తుపుక్కున బస్సు కిటికీలో నుంచి వుమ్మేసి–

"సీ అయ్యకేమన్నా జాకా" అంటూ ఇద్దరివైపు చూసాడు.

"ఒరేయి! నీ కడియం నా దగ్గర వుందిరా" అంటూ జేబులో నుండి కడియం తీసి బీరప్పకు చూపించాడు.

బీరప్ప వెంటనే లేచి కడియాన్ని లాక్కోబోయాడు. అంత వరకు చూస్తున్న ట్రెజరీ అక్కౌంటెంటు కూడా సమితి అక్కౌం

సెంటుతో చేయి కలిపాడు. ముగ్గురి చేతులు కడియంలో చిక్కానవి.

వీరప్ప బస్సులో వున్నవారి వైపు చూసి, మళ్ళీ వెంటనే కడియం వైపు, కడియాన్ని గుంజేవాళ్ళ వైపు చూశాడు.

ఇక అంతే!

"దొంగలు...దొంగలు...దొం..." అంటూ అరిచాడు.

బస్సులోని జనం వొక్కసారే లేచి యిద్దర్నీ చితకకొట్టారు.

బస్సు కదిలింది...

వీరప్ప చేతికి కడియం మెరుస్తోంది.

---

○ వందొమ్మిది వందల ఎనభై రెండులో ఆంధ్రజ్యోతి కథల పోటీలో కన్సోలేషన్ బహుమతి పొందిన కథ.

○ కేంద్ర సాహిత్య అకాడమి, న్యూ ఢిల్లీ వాళ్ళు ప్రచురించిన "తెలుగు కథ"లో గూడ చోటు చేసుకుంది.